సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం . 11 . మే . 2024



ఏపీఎల్ ఎంపికలకు విశేష స్పందన

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్–3 ఎంపికలకు విశేష స్పందన లభించింది. -VIIIలో



వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌పై దాడి

మదనపల్లె పట్టణంలో కౌన్సిలర్ పి. ఈశ్వర్ నాయక్, అతడి సోదరుడు అమరేంద్ర నాయక్, వినోద్‌కుమార్‌నాయక్‌లపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. -VIIIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.190
రెండోరకం	రూ.100	రూ.140

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 383 మెట్రిక్ టన్నులు



యువత క్రేజీ బైకులపై ర్యాలీగా వస్తున్నారు.. వాహనాల్లో దిగిన మహిళలు వడివడిగా నడుస్తున్నారు. మరికొందరు డప్పులు కొట్టుకుంటూ బలప్రదర్శనగా వెళ్తున్నారు. పిల్లాజల్లా.. ముసలీముతకా కళ్లల్లో కాంతినింపు కుంటూ అడుగులేస్తున్నారు. శుక్రవారం కడప నగరంలో కనిపించిన దృశ్యాలివి. ఏ వీధి చూసినా జనం కేరింతలే.. ఎటునుంచి వచ్చినా.. దారులన్నీ మద్రాస్ రోడ్డువైపే మళ్లాయి. కడప నగరమంతా ఒక్కచోటికి వచ్చి చేరింది. సీఎం వైఎస్ జగన్ రాకతో నగరం జనసంద్రమైంది.

- ఆద్యంతం ఉత్సాహంగా సాగిన వైఎస్ జగన్ ప్రసంగం
- అభిమానుల్లో ఉరకలెత్తిన ఉత్సాహం
- జనసంద్రమైన కడప నగరం



వన్స్‌మోర్ జగనన్న.. అభిమాని ఉత్సాహం



కడప నగరంలోని వన్ టౌన్ సర్కిల్ వద్ద జరిగిన సభకు హాజరైన జనసందోహం (ఇన్‌సెట్) ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

కడప గడపన సింహగర్జన

సాక్షి ప్రతినిధి, కడప: సీఎం వైఎస్ జగన్‌కు సొంత గడ్డపై మమకారం ఏపాటిదో మరోసారి తెలిసింది. కష్టాల్లో అండగా నిల్చిన తీరు గుర్తు చేసుకున్న విధం ముచ్చటేసింది. రాష్ట్రానికి రాజైనా తల్లికి బిడ్డే అన్నట్లుగా ముఖ్యమంత్రి, కడప ప్రజానీకం మధ్య పరస్పర భావోద్వేగం నగరం నడిబొడ్డున ఆవిష్కృతమైంది. 'నేను కష్టాలలో నష్టాలలో ఉన్నప్పుడు నన్ను కంటికి రెప్పలా చూసుకున్న గడ్డ, నేను పుట్టిన ఈ కడప గడ్డ, నాకు అత్యధిక మెజారిటీని కట్టబెట్టి నన్ను ఈ స్థానంలో కూర్చోబెట్టిన కడప గడ్డను, మిమ్మల్ని మీ బిడ్డ జగన్ మరిచిపోడు' అని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పినప్పుడు కడప ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. 'మీ అండగా మేమున్నాం జగన్' అంటూ కేరింతలు కొట్టారు. 'అన్నా...మేమున్నా'మంటూ యువత దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. 'నాయనా...మేముండగా ఏకష్టము రాదం'టూ మహిళలు చెమర్చిన కళ్లు తుడ్చుకుంటూ చెప్ప సాగారు. ఇదంతా పొట్టిశ్రీరాములు విగ్రహం చెంతన చోటుచేసుకున్న సన్నివేశం.

చంద్రబాబుతో జిల్లాకు చంద్రగ్రహణం...

చంద్రబాబు పాలనలో జిల్లాకు చంద్రగ్రహణం పట్టింది.చెప్పుకునేందుకు ఒక్కటంటే ఒక్కటి కూడా ఆయన పాలనలో నిర్దిష్టమైన అభివృద్ధి జిల్లాలో లేదు. పైపెచ్చు కడప గుండాలు, పులివెందుల రౌడీలంటూ కించపరుస్తూ వచ్చారు. ఈ పరిస్థితులల్లో మరోమారు మోసపోవద్దు జిత్తులమారి చంద్రబాబు అపద్ధపు హామీలతో వస్తున్నాడని సీఎం వైఎస్ జగన్ హెచ్చరికలు చేయడంతో ప్రజలు ప్రతిస్పందించారు. ఇంతకు ముందు చూశామన్నా జన్మభూమి కమీటీలతో వేధించారని కొందరు నినదిస్తే, నీరు–చెట్టు నిధులతో బుగ్గ వంకలో కాలువలు తీసి దోపిడీ చేశారని మరికొందరు నినదించారు. జగన్‌మాటలకు ప్రజలు అనుకరిస్తూ మీకేం ఇబ్బంది లేదు, మేమంతా మీవెంటే కడప గడ్డ వైఎస్సార్‌సీపీ అడ్డా అంటూ కేరింతలు కొట్టారు.

ఓట్లు చీల్చే కుట్ర: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మన కన్నును మనమే పొడ్చుకున్నట్లే, ప్రతి ఓటు కూడా విలువైనది. చంద్రబాబును గెలిపించేందుకే మన ఓట్లు చీల్చేందుకే కాంగ్రెస్ రంగప్రవేశం చేసిందని సీఎం జగన్ చెప్పారు. చంద్రబాబు బహిరంగ కాపురం బీజేపీతో చేస్తూ చీకటి కాపురం కాంగ్రెస్‌తో చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చాలనే కుట్రలను నిలువరించాలని ఎమ్మెల్యే అభ్యర్థిగా అంజద్ బాషాను నిలిపాం. కొంచెం కోపం ఉంటే మన్నించాలని సీఎం కోరారు. మీ బిడ్డ సీఎం కావాలంటే అంజాద్‌బాషా ఎమ్మెల్యే కావాలని గుర్తు పెట్టుకోవాలని అభ్యర్థించారు.

కడపలో టీడీపీకి వణుకు...

సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభతో టీడీపీకి వణుకు పుట్టింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వేదికగా ఆరోపణలు చేస్తూ, పెట్టుడు మనుషులతో హైప్ క్రియేట్ చేస్తూ వచ్చిన ఆ పార్టీ అంచనాలు శుక్రవారంతో పటాపంచలయ్యాయి. వేలాదిగా కార్యకర్తలు ఒక్కచోటికి తరలివచ్చిన విధం, అశేష ప్రజానీకం మద్దతు సీఎం శ్రేణులను ఉత్తేజపరుస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం టీడీపీకి నిద్రపట్టకుండా చేయనున్నట్లు పలువురు వెల్లడిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కడప గడ్డ సొంత బిడ్డగా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ ఆశలు గల్లంతయ్యినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



జై జగన్.. యువతి ఆనందోత్సాహం



మేముసైతం.. సభకు తరలివచ్చిన ముస్లిం మహిళలు



హలో సెల్.. అభిమాన నేతను సెల్‌లో బంధిస్తున్న యువకులు



హ్యాట్సాఫ్.. వైఎస్ జగన్‌ను చూసిన సంతోషంలో మహిళల కేరింత



అమరజీవి సాక్షిగా.. అభిమానుల కేరింతలు

న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పీలేరు: ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వాహకులు ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలని జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నోడల్ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. పీలేరు పట్టణంలోని రెస్టారెంట్, బార్, కేవీపల్లె మండలం గర్నిమిట్టలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయాల నియంత్రణపై నిఘా ఉంచామన్నారు. జిల్లాలో చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు జయసింహ, రామకృష్ణశాస్త్రి, గాయత్రి, హేమంత్‌కుమార్, సుధాకర్, విజయ్, రెడ్డినాయక్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ బి. కృష్ణారావు అన్నారు. శుక్రవారం శిక్షణలో ఉన్న 8 మంది ఐపీఎస్ అధికారులు అన్నమయ్య జిల్లాకు వచ్చారు. వారు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపట్టిన పోలీసు చర్యలను ట్రైనీ ఎస్పీలకు ఎస్పీ వివరించారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు బందోబస్తు ఏర్పాటు, నియోజకవర్గంలోని స్థానిక పోలీసులు, పారా మిలిటరీ దళాలతో కవాతు నిర్వహించడం వలన ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా భరోసా కల్పించినట్లు అవుతుందన్నారు.

ఈ మూడు రోజులు చాలా కీలకం

నేటి సాయంత్రం ప్రచారానికి తెర

- 13న ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం
- ఈవీఎంలు తీసుకెళ్లే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, చిత్రంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు

రాయచోటి: నేటి నుంచి మూడు రోజులు చాలా కీలకం. పక్కా ప్రణాళిక, పటిష్టమైన సూక్ష్మ కార్యాచరణతో ఎన్నికలను విజయవంతం చేయాలి. పండుగ వాతావరణంలో పోలింగ్ నిర్వహణ ఉండాలి.. అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి ఉద్బోధించారు.

- శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, సెక్టోరల్ అధికారులు, విద్యుత్ వైద్య శాఖ అధికారులు తదితరులతో మే 13న పోలింగ్ సందర్భంగా వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలు, చేయాల్సిన ఏర్పాట్లు, కార్యాచరణ అమలు తదితర అంశాలపై కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 గంటల ముందుగా అన్ని లాడ్జిలు, కళ్యాణమండపాలు, హోటల్స్, పబ్లిక్ గుమికూడే ప్రదేశాలలో పోలీసులతో కలిసి ఎంపీడీవోలు స్వయంగా తనిఖీలు చేయాలన్నారు. నియోజకవర్గం వెలుపల నుండి వచ్చిన రాజకీయ పార్టీల కార్యకర్తలు, ఇతర ప్రచార కార్యకర్తలు, ఓటర్లు కాని వారు ఉండకుండా స్వయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఇంకా కలెక్టర్ ఏం సూచించారంటే..
- పోలింగ్ కేంద్రాల వద్ద నూరు మీటర్ల పరిధిలో ఎలాంటి ప్రచారం చేయరాదు. రాజకీయ ప్రచార సామగ్రి పోస్టర్లు, బ్యానర్లు, ఫోల్డర్లు ఉండరాదు. పోలింగ్ కేంద్రాలలో ర్యాంపు, టాయిలెట్, తాగు నీరు ఏర్పాటు ఉండేలా ఎమ్మార్వోలు, సెక్టార్ అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే అవసరమైన చోట పోలింగ్ కేంద్రం వద్ద ఓ పెద్ద షామియానా కుర్చీలు ఏర్పాటు చేయాలి. బీఎల్‌ఓలతో ఓటర్ల సహాయ డెస్క్ ఏర్పాటు చేయాలి. ప్రతి పోలింగ్ కేంద్రం లోపల, బయట వెలుతురు ఉండాలి. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం తప్పకుండా ఉండాలి. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్సకు అవసరమయ్యే మందులు ఉంచుకోవాలి.ప్రతి పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లడానికి బయటికి రావడానికి ఒకటే దారి ఉండాలి. పోలింగ్ విధులలో పాల్గొనడానికి వచ్చే ఉద్యోగులు ముందు రోజు పోలింగ్ కేంద్రంలో ఉంటారు కనుక కనీస వసతులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ బాగా పని చేయాలి.
- ఈవీఎంలను తరలించే ఏ వాహనానికైనా జీపీఎస్ ట్రాకింగ్ అమర్చుకోవాలి. రహస్య ఓటింగ్ పద్ధతికి భంగం కలిగిస్తూ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో వీడియోలు ఫోటోలు తీయరాదు. నియోజకవర్గంలోని కంట్రోల్ రూములు ఈనెల 14 వరకు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా సంఘటన జరిగిందని సమాచారం వస్తే వాస్తవ సమాచారాన్ని తెలుసుకోగలగాలి.
- సెక్టార్ వారిగా డిస్ట్రిబ్యూషన్ ప్లాన్ చేసుకోవాలి. నిర్దిష్ట సమయం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యేలా చూడాలి.
- పోలింగ్ ముగిసిన అనంతరం రిసెప్షన్ కేంద్రానికి వచ్చే ఈవీఎంలను పోలింగ్ స్టేషన్ వారీగా, సెక్టార్ వారీగా తీసుకుని అసెంబ్లీ, పార్లమెంట్ పరంగా విడివిడిగా భద్రపరచాలి. ఎన్నికల కమిషన్ నూతనంగా ప్రవేశపెట్టిన సమర్ధ యాప్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలి.
- గత అనుభవాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో పారదర్శకంగా విధులు నిర్వహించి ఎన్నికల విజయవంతానికి కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్ట ఏర్పాట్లు

రాయచోటి: కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన కేంద్ర ఎన్నికల పరిశీలకుడు వైభవ్ శుక్ల, జిల్లా ఎస్పీ కృష్ణారావులతో కలిసి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు.

- ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, సీసీటీవీ కెమెరాలను అమర్చడంతో పాటు బ్యారికేడింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా టేబుళ్ల ఏర్పాటు, రాజకీయ పార్టీల ఏజెంట్లు కూర్చునేందుకు చుట్టూ బారి కేడింగ్, అభ్యర్థులు, ఏజెంట్లు వచ్చి వెళ్లేందుకు ప్రత్యేక దారి తదితర ఏర్పాట్లను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలన్నారు.
- జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల దగ్గర ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తుతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు.
- ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, ఎన్నికల నిర్వహణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో టీడీపీ అస్త్ర సన్యాసం!

- పల్లెల్లో టీడీపీ అభ్యర్థి ఎవరో కూడా తెలియని వైనం
- నామమాత్రంగా ప్రచారం ముగింపు
- నిస్తేజంలో టీడీపీ క్యాడర్



జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట: ఏ ఎన్నికైనా బరిలో నిలిచే అభ్యర్థి, ఆ పార్టీ యంత్రాంగం విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతారు, విజయమో, వీరస్వర్గమో అన్నంతగా ప్రత్యర్థులతో తలపడతారు. అయితే ప్రస్తుతం తంబళ్లపల్లెలో టీడీపీ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. టీడీపీ చరిత్రలో ఎన్నడూ చూడని దయనీయమైన ప్రస్తుత పరిస్థితిని పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేక పోతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో తలపడే స్థితిలో లేని టీడీపీ ఓటింగ్‌కు ముందే అస్త్ర సన్యాసం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎక్కడా ప్రచార ఆర్భాటాలు లేవు, ఎన్నికల్లో తమ అభ్యర్థికి ఓటు వేయమన్న అభ్యర్థనలు లేవు. సోమవారం ఓటింగ్ జరగనుండగా అందుకు తగ్గట్టుగా ఏర్పాట్ల కోసం క్యాడర్ పని చేయడమూ లేదు. దీనితో ఓటింగ్‌కు ముందే టీడీపీ ఓటమి పాలైందా అన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లోనే జోరుగా సాగుతోంది.

అభ్యర్థి ఎవరో తెలియదు

టీడీపీ అభ్యర్థుల తొలి జాబితాలోనే తంబళ్లపల్లె అభ్యర్థిగా జయచంద్రారెడ్డి పేరును చంద్రబాబు ఫిబ్రవరి 24న ప్రకటించారు. రాజకీయాలకు, టీడీపీకి కొత్త అయిన అయన్ను చూడాలని పల్లెల్లోని ఓటర్లు ఎదురుచూశారు. ఆరు మండలాల్లో 1,200లకుపైగా పల్లెలు ఉన్నాయి. ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బంది కూడా లేదు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రతిపల్లెకు తారురోడ్లు నిర్మించారు. అయినప్పటికి ఇందులో సగం పల్లెల్లోనైనా టీడీపీ అభ్యర్థి ప్రచారం జరగలేదు. ప్రచారానికి వెళ్లినా కొద్దిసేపటికే ముగిస్తారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు టీడీపీ అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితి. ఓటర్లతో కనీస పరిచయాలు లేకపోవడం, తన సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇవ్వడం మిగతా కులాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వారం–పదిరోజులుగా టీడీపీ ప్రచారమే కనిపించడం లేదు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గం మొదట్లో జయచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినా ఆ తర్వాత ఆయనకు దగ్గరయ్యారు. కానీ శంకర్ వర్గాన్ని గుర్తించకపోవడంతో అభ్యర్థి తీరుపై అసంతృప్తితో వారు దూరమయ్యారు.

అయిష్టంగానే కిరణ్

టీడీపీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డిని మార్చేవరకు తంబళ్లపల్లెలో అడుగుపెట్టను అని చెప్పిన బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి చివరకు సర్దుకుపోయారు. నియోజకవర్గ పర్యటనల్లో జయచంద్రారెడ్డితో కలిసి కిరణ్ అయిష్టంగానే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనికితోడు కిరణ్ వర్గీయుల ప్రచారంలో ఎంపీ అభ్యర్థికి మాత్రమే ఓట్లు వేయాలని కోరుతుండటం గమనార్హం.

చంద్రబాబు హెచ్చరించినా

టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని చంద్రబాబు రెండుసార్లు హెచ్చరించినా ఆర్థిక వనరులను సమకూర్చుకునే విషయంలో చేతులెత్తేసినట్లు తెలిసింది. దీంతో చంద్రబాబు కూడా తంబళ్లపల్లెలో టీడీపీ గెలుపు అవకాశాలపై ఆశలు వదులుకున్నట్లు స్పష్టమవుతోంది.

ఎన్నికలకు క్యాడర్ దూరం

సోమవారం జరిగే ఎన్నికలకు మెజారిటీ టీడీపీ క్యాడర్ దూరంగా ఉంటోంది. గెలుపునకు పనిచేయాలని అభ్యర్థి జయచంద్రారెడ్డి నుంచి పిలుపు లేకపోవడంతో ముఖ్యమైన నేతలు, మండలస్థాయి నాయకులు నిస్తేజంగా ఉండిపోయారు. ఎన్నికల్లో పనిచేసేందుకు కనీస ఖర్చులు భరించకుంటే ఓటర్లను కలిసి ఎలా ఓట్లు అడుగుతామని అంటున్నారు.



క్లుప్తంగా

కాలిపోయిన గుర్రం'కొండలు'


కాలిపోతున్న గుర్రం కొండలు

గుర్రంకొండ : గుర్రంకొండలోని సాయిబాబా గుడి వెనుక వైపు ఉన్న మిడిమాలపు కొండలపై చెట్లు (గుర్రంకొండలు) మొత్తం కాలిపోయాయి. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కాలనీ పరిసరాల్లోని కొండలకు నిప్పు పెట్టడంతో దావానలంలా వ్యాపించి 200 ఎకరాల్లో వృక్ష సంపద కాలిపోయింది. అందులో జంతువులు మంటలకు విలవిలలాడిపోయాయి. రాత్రంతా మండుతూ ఉండడంతో నిప్పుకణాలు గాలికి ఎగసిపడ్డాయి.

వివాహిత అదృశ్యం

బి.కొత్తకోట : ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బి.కొత్తకోట తేరువీధికి చెందిన రాజశేఖర్‌కు చిన్నదేవి(20)తో మూడు నెలల క్రితం వివాహమైంది. బుధవారం నుంచి చిన్నదేవి కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కటింగ్ మెషిన్ పడి కార్మికుడికి గాయాలు


గాయాలపాలైన చేనేత కార్మికుడు కుమార్

మదనపల్లె : ప్రమాదవశాత్తూ కటింగ్ మెషిన్ చేతిమీద పడడంతో చేనేత కార్మికుడు గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. చేనేత నగర్‌లో నివాసం ఉంటున్న కే.కుమార్(33) తాను పని చేస్తున్న చోటులో కర్ర అడ్డుగా ఉండటంతో తొలగించేందుకు కటింగ్ మెషిన్‌తో పనిచేస్తున్నారు. ప్రమాదవశాత్తూ మిషన్ జారి మీద పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

వీఆర్‌ఏ ఎన్నికల ప్రచారం

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండలం డి.నేలటూరు వీఆర్‌ఏ నాగసుబ్బయ్య యాదవ్ శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డి.నేలటూరులో టీడీపీ నాయకులతో తిరుగుతూ మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను ప్రభావితం చేసినట్లు తెలిసింది. నియమావళి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి ప్రచారంలో పాల్గొనకూడదు. అయితే ఆయన మాత్రం మీకు ప్రభుత్వ భూములు కావాలంటే టీడీపీని గెలిపించాలని కోరడం ఎమిటంటూ స్థానికులు చర్చించుకున్నారు.


డి.నేలటూరులో ఎన్నికల ప్రచారంచేస్తున్న వీఆర్‌ఏ నాగసుబ్బయ్య యాదవ్ (బ్లూ షర్ట్)

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీకి చెందిన కుటుంబాలు


కసిరెడ్డిగారిపల్లె టీడీపీ కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రైల్వేకోడూరు : చిట్వేలి మండలం కె.కందులవారిపల్లెలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు, పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు బత్యాల చంగ్రాయుడు, తిప్పన క్రిష్ణయ్య శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే కాకుండా ఎల్లవేళలా ప్రజలతో మమేకమవ్వడమే తన అభిమతమన్నారు. చంద్రబాబు కల్లబొల్లి మాటలతో మోసగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రైల్వేకోడూరులో ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులలు, ఎంపీ అభ్యర్థి


టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, కుంబా రమణ, మహేష్, ప్రసాద్, నాగరాజు, గణేష్, శివ, నరసింహులు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణపురం నుంచి..

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె, కొత్త మేదరపల్లె పంచాయితీలోని సూర్యనారాయణపురానికి చెందిన టీడీపీ నాయకులు ఉప్పుతోల్ల నాగరాజు, సుబ్బయ్య, బాబు, మంజుల, శ్రీనివాసులు, యల్లప్ప, దేవపట్ల, నాగరాజు, గోపాల్, రెడ్డయ్య, రమణ, కసిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయితీ కొత్తరోడ్డుకు చెందిన రమణ, ఆంజనేయులు, భరత్‌కుమార్, లోకేష్, మధు, నరసింహులు, చిన్నోడు, శివయ్య, సునీల్, వీరాంజి నేయులు, నగేష్, నరసింహులు, రామచంద్ర, దామోదర్, పెద్దరాజు, గాలంగుండ్లపల్లెకు చెందిన నోముల వెంకటరమణ, చలపతి, నాగరాజ, సుబ్బరామ, చిన్నయ్య, వెంకటరమణ, సుబ్బయ్య, వెంకటరమణ, రామకృష్ణ, వెంకటరమణ, విష్ణువర్ధన్, బాలాజీ, సుమారు 10 కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు.

వడ్డెపల్లెలో...

మండలంలోని కసిరెడ్డిగారిపల్లె గ్రామం వడ్డెపల్లెకు చెందిన 12 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ పార్టీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారు శివ, రఘు, సుబ్బయ్యలు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి పార్టీలోకి చేరినట్లు తెలిపారు.

మద్యం దుకాణం వద్ద టీడీపీ అభ్యర్థి

మదనపల్లె : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ బాషా(జహా) ప్రచార పిచ్చి పీక్స్‌కు చేరుకుంది. ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద సేల్స్‌మెన్‌లపై పలు ప్రశ్నలు సంధించి హల్‌చల్ చేశారు. ఎల్లో మీడియాను వెంటపెట్టుకుని చిత్తూరు బస్టాండులోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్దకు చేరుకుని 15 నిమిషాలపాటు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇదేమి ప్రచార యావరా బాబూ అంటూ స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. అంతటితో ఊరుకోని షాజహాన్‌బాషా సేల్స్‌మెన్‌ను ఏ బ్రాండులు అమ్ముతున్నారు? ఏ డిస్టిలరీస్‌లో దీన్ని తయారుచేశారు? అంటూ ప్రశ్నించి జిమ్మిక్కులు ప్రదర్శించారు. కొందరు ఈ తతంగాన్ని వీడియో తీసి సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమంటూ చర్చించుకోవడం విశేషం.


మద్యం దుకాణం ఎదుట ఇంటర్వ్యూ ఇస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా

వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌పై టీడీపీ నాయకుల దాడి

దాడి చేసిన వారిలో పంచాయితీ కార్యదర్శి


చికిత్స పొందుతున్న కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్

మదనపల్లె : పట్టణంలోని 25వవార్డు కౌన్సిలర్ పి.ఈశ్వర్‌నాయక్(37), అతడి సోదరుడు అమరేంద్రనాయక్(40), నక్కలదిన్నెవాసి వినోద్‌కుమార్‌నాయక్(30)లపై శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయంత్రం 7 గంటల ప్రాంతంలో వైఎస్సార్ సీపీ 25వ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్ ఇంటింటి ప్రచారంలో పాల్గొని వస్తుండగా, స్థానికులైన మునస్వామినాయక్, కొత్తవారిపల్లె పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్, జయానాయక్‌లు తమ ఓట్లు 25వవార్డు నక్కలదిన్నె నుంచి గాంధీపురానికి బదిలీ అయ్యేందుకు నీవే కారణమంటూ గొడవకు దిగారు. ఇందులో తనకు ఏమాత్రం సంబంధం లేదని, సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వారు కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. దాడిలో ఈశ్వర్‌నాయక్, సోదరుడు అమరేంద్రనాయక్, స్థానికుడు వినోద్‌కుమార్‌నాయక్‌లు గాయపడ్డారు. బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దాడిఘటనపై ఫిర్యాదుచేశారు. ఈశ్వర్‌నాయక్‌ను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డిలు పరామర్శించారు. దాడి ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు.

ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చేందుకు కూటమి కుట్ర

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీల ఓట్లు చీల్చేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కువైట్ మైనారిటీ సభ్యులు ఆబూతురబ్, లక్కీ అజీస్, సయ్యద్ సలీమ్ అన్నారు. మాలియాలో జుమా రోజు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లింలు, ముఖ్యంగా కడపలోని ముస్లిం, మైనార్టీలు ఆలోచన చేసి ఓటు వేయాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో విచిత్రమైన రాజకీయం నడుస్తోందని, తెలుగుదేశం, బీజేపీ , జనసేన కూటమితో పాటు కాంగ్రెస్ కూడా అనైతిక పొత్తులో ఉందనేది జగమెరిగిన సత్యమన్నారు. తెలుగుదేశం కడప పార్లమెంట్ అభ్యర్థి ప్రచారం చేయకపోవడమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ అభ్యర్థిగా ముస్లింను నిలబెట్టి ముస్లింల ఓట్లు చీల్చి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలిచేటట్లు చంద్రబాబు, షర్మిల ప్లాన్ వేశారన్నారు. కరోనా సమయంలో రెండు నెలలు పేదలకు అన్నదానం చేసిన వ్యక్తి, బుగ్గవంక వరదల సమయంలో ప్రాణ , ఆస్తి నష్టం జరక్కుండా స్వయంగా వరదబాధితులను ఆదుకున్న అంజద్‌బాషాను మూడోసారి గెలిపించాలని కోరారు. కడప ఎంపీగా వైఎస్ అవినాష్ రెడ్డిని గెలిపించాలని ముస్లింలను కువైట్ నుంచి వారు ప్రజలను అభ్యర్థించారు.

ఈదురుగాలులతో అరటి పంటకు నష్టం

లింగాల : లింగాల మండలం రామన్నూతనపల్లె, ఇంటిఓబయ్యపల్లె గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు గెలలతో ఉన్న అరటి పంట నేలకూలింది. కోతకు వచ్చిన పంట నేలకూలడంతో తీరని నష్టం వాటిల్లిందని, తమను ఆదుకోవాలని రామన్నూతనపల్లె రైతులు దీపక్, కుళ్లాయిరెడ్డి, కుళ్లాయప్ప, బాబురెడ్డి, గొంది గంగరాజు, ఇంటిఓబయ్యపల్లె రైతులు మధుసూదన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రమణారెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల దాకా నష్టం వాటిల్లిందని ఉఅధికారుల అంచనా.


రామన్నూతనపల్లెలో నేలకూలిన యాలక్కి అరటిపంట

ఇండిపెండెంట్ల ఇంటింటి ప్రచారం


ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో ఉంటూ టీడీపీ అభ్యర్థికి ప్రచారం చేయడంపై నిలదీస్తున్న మోతీనగర్ స్థానికులు


మెడలో టీడీపీ కండువా కప్పుకుని ప్రచారం చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ భార్య, ఇండిపెండెంట్ అభ్యర్థి గుల్నాజ్‌బేగం

- టీడీపీ స్లిప్పులు పంచుతుండగా నిలదీసిన జనం
- బీఎల్‌వోలపై నెట్టివేసి తప్పించుకునే ప్రయత్నం

మదనపల్లె : స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచి.. టీడీపీ అభ్యర్థుల స్లిప్పులు పంచుతున్న వారిని జనం నిలదీసిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో చోటు చేసుకుంది. మరో రెండు రోజుల్లో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఎలాగైనా గెలుపొందడానికి టీడీపీ ప్రయత్నిస్తోంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా షాజహాన్‌బాషా నామినేషన్ దాఖలు చేశారు. అంతేగాక పక్కా ప్రణాళికతో తన భార్య గుల్నాజ్‌బేగం, అనుచరుడు నిసార్ అహ్మద్‌లను స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేయించారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గుల్నాజ్‌బేగానికి రూమ్ కూలర్, నిసార్ అహ్మద్‌కు వజ్రం గుర్తులను ఆర్వో హరిప్రసాద్ కేటాయించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు ప్రచారం చేయడం, ఎన్నికల ప్రచార సామగ్రిని తమ వాహనాల్లో తరలించడం, నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరించడం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్వో వారిని హెచ్చరించారు. ఇవేమీ పట్టని ఆ అభ్యర్థులు తమ అనుచరులను తీసుకుని మోతీనగర్‌లో టీడీపీ కూటమి తరఫున స్లిప్పులను పంపిణీ చేయడమేగాక, డబ్బులు ఇస్తామని చెపుతూ ముందుకుసాగారు. దీన్ని గమనించిన స్థానికులు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఉంటూ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ప్రచారం చేయడమేంటని నిలదీశారు. దీంతో స్థానికులకు, టీడీపీ నాయకులకు మధ్య వివాదం జరిగింది. ఎన్నికల అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని, స్లిప్పుల పంపిణీపై ప్రశ్నించారు. బీఎల్వోలు సక్రమంగా పంపిణీ చేయలేదని ఫిర్యాదులు రావడంతో తామే పంచేందుకు వచ్చామని చెప్పారు. ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

ఏపీఎల్ ఎంపికలకు విశేష స్పందన


ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు


హాజరైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. సౌత్‌జోన్ కన్వీనర్ అవ్వారు రెడ్డిప్రసాద్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎస్.ఖాజామైనుద్దీన్ మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-3 మ్యాచ్‌లకు సంబంధించి జట్ల కోసం ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై. శివప్రసాద్, కె.విష్ణు మోహన్‌రావు, పైడికాల్వ విజయ్‌కుమార్, ఎల్.మునికుమార్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి దుర్మరణం


వెంకట ముని (ఫైల్)

నిమ్మనపల్లె : ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన గురువారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. చౌడేపల్లె మండలం, పంచాయతీ పొదలపల్లికి చెందిన చిన్నప్ప కుమారుడు వి.వెంకటముని(47), గురువారం సాయంత్రం తన సొంత ట్రాక్టర్‌లో వరిగడ్డి తీసుకుని వాల్మీకిపురం మండలం చింతపర్తిలో దింపి తిరిగి ఇంటికి వస్తున్నాడు. చింతపర్తివారిపల్లె మలుపు వద్ద వేగాన్ని నియంత్రించలేకపోవడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ కింద పడిన వెంకటముని అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు నిమ్మనపల్లె పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తూ బాలుడి మృతి


కుశాల్ కుమార్ రాజు (ఫైల్)

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురంలో సెల్‌ఫోన్ చూస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఓ బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన ఉదయం 6.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఈటమాపురం గ్రామానికి చెందిన మహేశ్వర్ రాజు, అశ్వనిల మొదటి కుమారుడు కుశాల్ కుమార్ రాజు(7) తన తాత వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని ఇంటి గుమ్మం అరుగుమీద ఫోన్ చూస్తూ వెనుకకు జరుగుతూ అరుగుపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తల వెనుక భాగం ముందుగా నేలను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన మహేశ్వర్‌రాజు విషయం తెలియగానే ఇంటికి వచ్చి కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ సంఘటనతో వారి కుటుంబంతో పాటు గ్రామంలో కూడా విషాదఛాయలు అలుముకున్నాయి.

మద్యం బాటిళ్లు స్వాధీనం


సెబ్ అధికారుల అదుపులో నిందితులు, మద్యం బాటిళ్లు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కోనంపేట గుండ్లచెరువు క్రాస్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోలో 98 కర్ణాటక మద్యం బాటిళ్లను తరలిస్తుండగా లక్కిరెడ్డిపల్లి సెబ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నట్లు సెబ్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని ప్రతి వాహనాన్ని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలం కొత్తరాచపల్లెకు చెందిన జనార్దన్ రాజు, మిద్దకాడ పల్లికి చెందిన షేక్ అబ్దుల్ గఫార్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

వైభవంగా అక్షయ తదియ



పూలంగి సేవలో చెన్నకేశవ స్వామి, నంది వాహనంపై కొలువుదీరిన కామాక్షి వైద్యనాథుడు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి,లక్ష్మీ చెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అక్షయ తదియ ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. పెన్నా నదిలో నీరు లేక పోవడంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోటార్ల వద్ద స్నానాలు ఆచరించి స్వామి వార్లను దర్శించుకున్నారు. కొందరు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనేక మంది భక్తులు బ్రాహ్మణుల ఆధ్వర్యంలో తమ పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు.

వైభవంగా చెన్నకేశవుని పూలంగి సేవ–

చెన్నకేశవ స్వామికి పూలంగి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామిని పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించారు. ధరింప చేసి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాలను అందజేశారు. కామాక్షీ వైద్యనాథేశ్వర ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీచక్ర సహిత కామాక్షీ అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించారు. రాత్రి చెన్నకేశవ స్వామి తనకు ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై, కామాక్షీ వైద్యనాథేశ్వర స్వాములు నంది వాహనంపైభక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా పలువురు ట్రాక్టర్లు, , ఆటోల యజమానులు వల్లూరు నుంచి పుష్పగిరి వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. ఎస్‌బీఐ చెన్నూరు, ఖాజీపేట బ్రాంచ్‌లు సంయుక్తంగా రీజనల్ మేనేజర్ కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, శుద్ధజలం పంపిణీ చేశారు. పలువురు దాతలు చెక్క భజన, హరి కథా కాలక్షేపాలను ఏర్పాటుచేశారు. ఈవో శ్రీనివాసులు, అర్చకులు సుమంత్ దీక్షితులు, రాజేశ్వర శర్మ పాల్గొన్నారు.

నేడు కళ్యాణోత్సవం

శనివారం ఉదయం 10 గంటలకు కామాక్షీ వైద్యనాథ స్వాములకు, చెన్నకేశస్వామికి రాత్రి 7 గంటల నుంచి కళ్యాణోత్సవం జరుగుతుంది. రాత్రి గజవాహన సేవ జరుగుతుంది.


చెన్న కేశవ స్వామి ఆలయం వద్ద భక్తులు


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మోటార్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు